www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 2 సంచిక -332 సోమవారం17 ఫిబ్రవరి 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## నలిగిన ప్రాణాలు



- ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట.. 18 మంది మృతి
- కుంభమేళా దగ్గర పడుతుండటంతో పెరిగిన రద్దీ
- రైలు కోసం ప్రయాణికులు పోటెత్తడంతో తొక్కిసలాట
- మృతుల్లో 10 మంది మహిళలు, ముగ్గురు చిన్నారులు

న్యూఢిల్లీ ఫిబ్రవరి 16 ప్రజావినికిడి:
న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో గత సాయంత్రం జరిగిన తొక్కిసలాటలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. మృతుల్లో 10 మంది మహిళలు, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. కుంభమేళా ముగింపు దశకు చేరుకుంటుండటంతో సందర్శించేందుకు భక్తులు పోటెత్తడంతో ఈ దుర్ఘటన జరిగింది. మిగతాది 2లో...

## చిక్కిపోయిన చికెన్

బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్



## పౌల్ట్రీ రంగాన్నికుదిపేస్తున్న మహమ్మారి

- తగ్గిన చికెన్, కోడిగుడ్ల ధరలు
- అమాంతం పెరిగిన మటన్ రేటు
- కిలో రూ.1,000 వరకు అమ్మినవ్యాపారులు
- చేపలు, రొయ్యలధరలు పైపైకి..
- మాంసం ప్రియులజేబులకు చిల్లు
- మటన్ షాపులవద్ద బారులు తీరిన జనం
- వెలవెలబోయిన చికెన్‌దుకాణాలు

హైదరాబాద్ ప్రజావినికిడి:
బర్డ్ ఫ్లూ ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో చికెన్ అమ్మకాలు పడిపోయాయి. ఆదివారం పూట కిటకిటలాడే చికెన్ సెంటర్లు మాత్రం వెలవెలబోయాయి. అయినప్పటికీ చికెన్ ధరలు మాత్రం తగ్గకపోవడం గమనార్హం. ప్రతీ ఆదివారం బిజీబిజీగా గడిపే చికెన్ సెంటర్ వ్యాపారులు ఈ వారం ఖాళీగా కనిపిస్తున్నారు. గడిచిన వారం రోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బర్డ్ ఫ్లూ భయంతో జనం చికెన్ తినడానికి ధైర్యం చేయడంలేదు. ఆదివారం కావడంతో మటన్, చేపలు కొనుగోలు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా బర్డ్ ఫ్లూ రావడంతో చికెన్ ధరలు చతికిలబడ్డాయి. పోనీ ధరలు తగ్గాయి..కదా మంచిగా చికెన్ కొనుగోలు చేసి ఫుల్‌గా తిందామనుకున్న మాంసాహార ప్రియులకూ అవకాశం దక్కలేదు. ఒక వైపు బర్డ్ ఫ్లూ ప్రభావిత ప్రాంతాల్లో చికెన్ షా పులపై ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో రెండు వారాల నుంచి ప్రజలకు చికెన్ అందుబాటులోకి లేకుండా పోయింది. మిగతాది 2లో...

## ఢిల్లీ కొత్త సీఎంపై నిరీక్షణకు తెర..



- బీజేపీ లెజిస్లేటివ్ పార్టీ సమావేశం ఫిక్స్
- ఢిల్లీ కొత్త సీఎం ఖరారు నేడే!
- రేసులో ముందున్న యువనేత
- ఇప్పటికే చర్చోపచర్చలు సాగిస్తోన్న హైకమాండ్

## భారత్‌కు అమెరికా భారీ షాక్!

- భారత్‌తో పాటు ప్రపంచంలోని పలు దేశాలకు అందించే మిలియన్ డాలర్ల నిధుల్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటన
- అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ శాఖ ప్రపంచ కుబేరుడు ఎలోన్ మస్క్ నిర్వహణలో ఉంది
- ప్రధాని మోదీ గతవారం అమెరికాలో పర్యటించారు.



### గుడ్డెద్దు చేనులో పడినట్లుగా

## కాంగ్రెస్ పాలన ఉంది

- బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీపై కిషన్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్
- సీఎం రేవంత్ రెడ్డి మాటలతోనే పబ్బం గడుపుతున్నారు
- బయ్యారం ఐరన్ ఓర్‌లో క్వాలిటీ లేదు
- బయ్యారం ఉక్కు ఫ్యాక్టరిపై తాము ఎలాంటి హామీ ఇవ్వలేదు



హైదరాబాద్ ప్రజావినికిడి:
ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ కులమేంటీ..? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండు ప్రభుత్వాలు ఒకేతాను ముక్కలని ఆరోపించారు. ఆదివారం వరంగల్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పర్యటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. గుడ్డెద్దు చేనులో పడినట్లుగా కాంగ్రెస్ పాలన ఉందని ఆక్షేపించారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలతోనే పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో దయనీయ పరిస్థితి నెలకొందని అన్నారు. కులగణనకు బీజేపీ మద్దతు మిగతా 2లో...

## జీబీఎస్ వ్యాధి పై ఆందోళన వద్దు...

- ఇప్పటికే సీఎం సమీక్ష చేశారు: మంత్రి బాలవీరాంజనేయస్వామి
- ఏపీలో గులియన్ బారే సిండ్రోమ్ కలకలం
- గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళ మృతి



అమరావతి,ఫిబ్రవరి 16, ప్రజావినికిడి:
గులియన్ బారే సింద్రోమ్ (జీబీఎస్)తో గుంటూరులో ఓ మహిళ మృతి చెందింది. మృతి చెందిన మహిళ స్వస్థలం ప్రకాశం జిల్లా అలసందలపల్లి అని గుర్తించారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వెంటిలేటర్ పై చికిత్స పొందుతూ ఆ మహిళ మృతి చెందింది. ఏపీలో జీబీఎస్ కేసులు పెరుగుతుండడంపట్ల ప్రజల్లో భయం నెలకొంది. ఈ నేపథ్యంలో, మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి స్పందించారు.

### అధికారుల ఆలోచన విధానంలో

## మార్పు రావాలి

- రాజకీయ నాయకులను గైడ్ చేసే విధానం అప్పట్లో ఉండేది
- ఇప్పుడు ఎందుకు అలా లేదో తెలియడం లేదు
- రాజకీయ నాయకులకు అవగాహన కల్పించే సెక్రటేరియట్ రూల్స్ ఉన్నాయి
- కొత్తగా సెలెక్ట్ అయిన కొందరు ఐపీఎస్‌లు తప్పుడు మార్గంలో నడుస్తున్నారు
- ఐఏఎస్, ఐపీఎస్‌లపై సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్ ప్రజావినికిడి:
రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం.గోపాలకృష్ణ రచించిన 'లైఫ్ ఆఫ్ కర్మయోగి' పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఆరు దశాబ్దాల జ్ఞాపకాలను పుస్తక రూపంలో తీసుకుని రావడం బిగ్ టాస్క్ అన్నారు. కొత్తగా ఐఏఎస్‌గా వచ్చే వాళ్లకు గోపాలకృష్ణ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.
చాలా మందికి కొంత మంది సీనియర్ ఐఏఎస్‌ల గురించి ఇప్పటికి తెలీదు.. శేషన్ ఐఏఎస్.. ఎన్నికల కమిషన్ ఉందని తట్టి లేపిన గొప్ప వ్యక్తి. రాజకీయ నాయకులను గైడ్ చేసే విధానం అప్పట్లో ఉండేది. ఇప్పుడు ఎందుకు అలా లేదో తెలియడం లేదు. రాజకీయ నాయకులకు అవగాహన కల్పించే సెక్రటేరియట్ రూల్స్ ఉన్నాయి. కొత్తగా సెలెక్ట్ అయిన కొందరు ఐపీఎస్‌లు తప్పుడు మార్గంలో నడుస్తున్నారు." అంటూ రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. "కొత్త ఐపీఎస్‌లు యూనిఫామ్ వేసుకొని సివిల్ పంచాయితీలు చూసుకోవడం దురదుష్టకరం. ఏసీ రూమ్ నుంచి మిగతా 2లో...

# తస్మాత్ జాగ్రత్త.. అలా చేస్తే అస్సలు స్పందించకండి

హైదరాబాద్: పోలీసులు ఎంతగా అవగాహన కల్పిస్తున్న ఏదో ఒక ప్రాంతంలో ప్రజలు మోసపోతునే ఉన్నారు. సైబర్ కేటుగాళ్ల చేతిలో పడి రూ.లక్షల్లో తమ కష్టార్జితాన్ని పోగొట్టుకుంటున్నారు. సామాన్యుల నుంచి ప్రభుత్వ అధికారుల వరకు మోసగాళ్ల వలలో చిక్కి భారీగా నష్టపోతున్నారు. కేటుగాళ్ల పట్ల ఎన్ని చర్యలు తీసుకుంటున్న మళ్లీ మళ్లీ ఏదో ఒక రూపంలో మోసాలకు పాల్పడుతునే ఉన్నారు. తాజాగా యాదాద్రి జిల్లాలో ఓ ఎమ్మార్వోకు ఏసీబీ అధికారిని అంటూ ఓ కేటుగాడు కుచ్చుటోపీ పెట్టాడు. అవినీతికి పాల్పడుతున్నావ్ అంటూ మోసగాడు డబ్బులు డిమాండ్ చేశాడు. అరెస్టు చేయకుండా ఉండాలంటే తాను చెప్పిన ఖాతాలో డబ్బులు వేయాలని బెదిరించాడు. డబ్బులు వేస్తే ఏం పట్టించుకోమని నమ్మబలికాడు. ఎమ్మార్వో భయపడిపోయి కేటుగాడు చెప్పిన ఖాతాల్లో డబ్బులు వేశాడు. సుమారుగా రూ. 3 లక్షల 30 వేలను ఆన్‌లైన్ ద్వారా ఎమ్మార్వో దామోదర్ బదిలీ చేశారు.



**ఏసీబీ డీజీ కీలక సూచనలు..**

అయితే, ఏసీబీ పేరుతో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్న వ్యవహారంపై ఏసీబీ డీజీ స్పందించారు. ప్రభుత్వ ఉద్యోగులపై కేసులు నమోదు చేయకుండా ప్రైవేట్ వ్యక్తులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఏసీబీ పేరుతో ఎవరైనా బెదిరింపులకు పాల్పడిన వెంటనే ఏసీబీకి, లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. మీపై కేసు లేకుండా చూస్తామంటూ డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీకి ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చారు.

**నకిలీ కాల్స్ నమ్మొద్దు..**

అలాంటి నకిలీ కాల్స్‌ను నమ్మవద్దని అన్నారు. ఏసీబీ అధికారుల పేరుతో ప్రభుత్వ ఉద్యోగులు లేదా సామాన్యులకు అలాంటి ఫేక్ కాల్స్ వస్తే టోల్ ఫ్రీ నెంబర్1కు ఫిర్యాదు చేయాలని అన్నారు. ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064ను సంప్రదించాలని చెప్పారు. ఏసీబీ తెలంగాణ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లో కూడా వాట్సాప్, ఫేస్ బుక్, ఎక్స్ ద్వారా కూడా ఫిర్యాదు చేమొచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుడు, బాధితుడి పేరు, వివరాలు రహస్యంగా ఉంచుతామని ఏసీబీ డీజీ పేర్కొన్నారు.

## చిక్కిపోయిన చికెన్

(మొదటి పేజి తరువాయి)మరోవైపు బర్డ్ ఫ్లూ ప్రభావం లేని చోట చికెన్ కొనుగోలు దుకాణాలు తెరచినా మాంసాహార ప్రియులు ముందుకు రా వడం లేదు. చికెన్ ధరలను తగ్గించి అమ్ముతున్నా వద్దు బాబోయ్ అంటూ ముఖం చాటేస్తున్నారు. ఆదివారం సైతం తెలుగు రాష్ట్రాల్లో చికెన్ దుకాణాలు వెలవెల బోయాయి. ప్రతి ఆదివారం ఎగబడి కొనుగోలు చేసే వారంతా ఉన్న పళంగా తగ్గిపోవడంతో వ్యాపారస్తులు లబోదిబోమంటున్నా రు. మార్కెట్‌లో ప్రస్తుతం చికెన్ ధర రూ.150కి అమాంతంగా పడిపోయింది. కొన్ని చోట్ల రూ.100కే అమ్మారు. ఇదే అదునుగా మటన్ ధరలు మండిపోతున్నాయి. బర్డ్ ఫ్లూ కారణంగా మార్కెట్‌కు వచ్చే కోళ్ల సంఖ్య తగ్గిపోవడం, ఆయా దుకాణాలకు సరిపడా కోళ్లు లేకపోవడంతో వ్యాపారస్తుల పరిస్థితి దయనీయంగా మారింది. బర్డ్ ఫ్లూ లేని ప్రాంతాల్లోనే చికెన్‌ను విక్రయిస్తున్నారు. చికెన్‌ను ప్రజలు తినవచ్చని శాస్త్రవేత్తలు, వైద్యులు చెబుతున్నప్పటికీ ప్రజలు భయాందోళనతో వాటిని తినడం మానేశారు.ఈ రెండు కారణాలతో 70 శాతం చికెన్ విక్రయాలు తగ్గిపోయాయని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. బర్డ్ ఫ్లూ ప్రభావంతో మాంసాహారులు అంతా చేపలు, రొయ్యలు, మటన్‌పై మోజు పడుతున్నారు. మార్కెట్లో చేపలు, రొయ్యలు, మటన్ కొనుగోలు చేస్తున్నారు. చేపలు, రొయ్యల మార్కెట్లు రద్దీగా మారాయి. చికెన్ దుకాణాల వైపు కన్నెత్తి చూడటంలేదు. ఇంతకుముందు మార్కెట్‌లో కిలో రూ.800 ఉన్న మటన్ ధర ఇప్పుడు ఏకంగా కిలో వెయ్యి రూపాయలకు చేరిపోయింది. ఇక చేసేదేమీ లేక మాంసాహారులు మటన్ వైపు చూస్తున్నారు. గతంలో కిలో కొన్న వారంతా ఇప్పుడు దాన్ని అర కిలోకు, గతంలో రెండు కిలోలు కొనుగోలు చేసిన వారు తాజాగా కిలోకు తగ్గి కొనుగోలు చేస్తున్నారు. దీంతో మటన్ దుకాణాల వద్ద జనం కిటకిటలాడుతున్నారు. చేపల ధరలు కూడా కిలో 400 రూపాయలకు చేరాయి. ఇక సాధారణ రొయ్యలు కిలో 900 రూపాయలు పలుకుతున్నాయి. చికెన్‌ను ప్రతి వారం కొనుగోలు చేసే మధ్యతరగతి వర్గాలంతా మటన్‌ను కొనలేక మౌనంగా ఉండిపోతున్నారు.

## నలిగిన ప్రాణాలు

(మొదటి పేజి తరువాయి) ప్రయాగ్‌రాజ్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు 14వ నంబర్ ప్లాట్‌ఫాంపై ఉండటంతో కుంభమేళాకు వెళ్లే భక్తులు అక్కడకు చేరుకున్నారు. అయితే, కుంభమేళాకే వెళ్లే స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆలస్యం కావడంతో వాటి కోసం వచ్చిన ప్రయాణికులు కూడా అదే సమయంలో 12, 13, 14 నంబర్ ప్లాట్‌ఫ్లాంపై ఉండటంతో ఒక్కసారిగా రద్దీ పెరిగి తొక్కిసలాట చోటుచేసుకుంది.తొక్కిసలాట ఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తొక్కిసలాటలో పలువురు మృతి చెందినట్టు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ధ్రువీకరించారు. రద్దీని అంచనా వేశామని, అయితే అంతా క్షణాల్లో జరిగిపోయింది రైల్వే పేర్కొంది. ఈ ఘటనపై అత్యున్నతస్థాయి విచారణకు ఆదేశించినట్టు తెలిపింది.

## నదీ జలాలను ఏపీ తన్నుకుపోతుంటే రేవంత్ సర్కారులో చలనం లేదు



తెలంగాణకు దక్కాల్సిన నదీ జలాలను ఏపీ తన్నుకుపోతుంటే రేవంత్ రెడ్డి సర్కారులో చలనం లేదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా రోజుకు 10 వేల క్యూసెక్కుల నీటిని ఏపీ తరలించుకుపోతోందని ఆరోపించారు. గత మూడు నెలలుగా ఈ తంతు జరుగుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం తమాషా చూస్తోందని కేటీఆర్ విమర్శించారు. నాడు కేసీఆర్ గోదావరి, కృష్ణా జలాల్లో ప్రతి బొట్టును కూపాడుకుంటూ బీడు భూములను సస్యశ్యామలంగా మార్చారని... కానీ కాంగ్రెస్ పార్టీ ఏడాది కాలంలోనే పంట పలాలను బీడుగా మార్చేసిందని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు ప్రాతిపదికన తెలంగాణ ఏర్పడిందని... అలాంటి రాష్ట్రంలో ఒక్కొక్కటిగా అన్నింటినీ రేవంత్ సర్కారు నాశనం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వం ఇప్పటికే కృష్ణా జలాల నుంచి 646 టీఎంసీల నీటిని వినియోగించుకున్నా, కాంగ్రెస్ సర్కారు అడ్డుకోవడంలేదని ఆగ్రహం వెలిబుచ్చారు.

## జీబీఎస్ వ్యాధిపై ఆందోళన వద్దు...

(మొదటి పేజి తరువాయి)



జీబీఎస్ వ్యాధి పట్ల ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు. ఇది అంటువ్యాధి కాదని స్పష్టం చేశారు. గులియన్ బారే సింన్డ్రోమ్ వ్యాధికి అన్ని ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. ఎవరికైనా జీబీఎస్ లక్షణాలు ఉంటే డాక్టర్లు తగిన వైద్యం అందించాలని అన్నారు. జీబీఎస్ పై సీఎం చంద్రబాబు ఇప్పటికే సమీక్ష నిర్వహించారని, ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత అని మంత్రి బాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. జీబీఎస్ వ్యాధిపై ప్రజల్లో అపోహలు తొలగించాలని పేర్కొన్నారు

## అధికారుల ఆలోచన విధానంంలో మార్పు రావాలి

-మొదటిపేజీ తరువాయి

బయటికి రావడానికి ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఇష్ట పడటం లేదు. జనంలోకి రండి అంటే రావడం లేదు. అధికారుల ఆలోచన విధానంంలో మార్పు రావాలి. నిబద్ధత ఉన్న ఆఫీసర్లు ఎక్కడ ఉన్నా పోస్టింగ్‌లు వస్తాయి" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## గుడ్డెద్దు చేనులో పడినట్లుగా కాంగ్రెస్ పాలన ఉంది



-మొదటిపేజీ తరువాయి

ఇస్తుందని స్పష్టం చేశారు. 42శాతం రిజర్వేషన్లపై మొదట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కులసంఘాలతో చర్చించాలని డిమాండ్ చేశారు. అప్పుడు తమ నిర్ణయం చెబుతామని కిషన్‌రెడ్డి అన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. బయ్యారం ఐరన్ ఓర్‌లో క్వాలిటీ లేదని చెప్పారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరిపై తాము ఎలాంటి హామీ ఇవ్వలేదని అన్నారు. రేవంత్ ప్రభుత్వం వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి లేని విషయాలను కల్పించుకుని మాట్లాడుతున్నారని విమర్శించారు. వారానికి ఒకసారి ఢిల్లీకి వెళ్లి సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పెద్దల దగ్గర హాజరువేయించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ఇష్టం వచ్చినట్లుగా రేవంత్‌రెడ్డి మాట్లాడితే.. చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. రేవంత్ దృష్టి మరల్చినంత మాత్రాన ఇచ్చిన హామీలను తెలంగాణ ప్రజలు మరచిపోరని కిషన్‌రెడ్డి చెప్పారు.

**రేవంత్ ప్రభుత్వంపై వ్యతిరేకత..**

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజల్లో తిరగలేని పరిస్థితి రాబోతోందని కిషన్‌రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని చెప్పారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఇలాగే వ్యతిరేకత వచ్చిందని.. అందుకే కాంగ్రెస్ విజయం సాధించిందని తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించిందని మండిపడ్డారు. అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు పదేళ్లు పట్టింది కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ సమయంలోనే వ్యతిరేకత మూటగట్టుకుందని చెప్పుకొచ్చారు. నాడు ప్రతిపక్షమే ఉండకూడదని కేసీఆర్ భావించారని అన్నారు. ఏకంగా లెజిస్లేటివ్ కౌన్సిల్ మూలాన్నే దెబ్బతీశారని కిషన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కేసీఆర్ పాలనలోనే ఆర్థిక వ్యవస్థ కొల్లగొట్టారు

సిద్దిపేట జిల్లా: పార్లమెంటు ఎన్నికల్లో మూడో సారి నరేంద్ర మోదీకి ప్రజలు అధికారం కట్టబెట్టారని, ప్రతిపక్షాల తీరు పార్లమెంట్లో విచిత్రంగా ఉందని ప్రజానీకం అంతా ఒకటే భావనతో అన్నారని మల్కాజ్ గిరి బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా, గజ్వేల్ పట్టణంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దేశం సుభిక్షంగా ఉండాలన్నా, ఆర్థికంగా, బలంగా ఉండాలన్నా, ప్రపంచంలో దేశం సగౌరవంగా ఉండాలంటే మోదీ ప్రధానిగా ఉండాలనేది ప్రజలకు తెలుసునని అన్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ కు 44 శాతం వస్తే.. బీజేపీకి 30 శాతం ఓట్లు వచ్చాయన్నారు. ఇప్పుడు తెలంగాణలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు మోదీని ఆశీర్వదించే విధంగా కనిపిస్తోందని ఈటల రాజేందర్ అన్నారు. ఉపాధ్యాయులకు అండగా కొట్లాడిన పార్టీ బీజేపీ అని, టీచర్ల విషయంలో, మధ్యతరగతి వారి విషయంలో బీజేపీ కృషిచేసిందని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య దేశంలో నే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తాండవిస్తోందని, ప్రపంచం లో 11 వ ఆర్థిక వ్యవస్థలో ఉన్న భారత్ మోదీ కృషితో 5 వ స్థానానికి వచ్చిందన్నారు. నిరుద్యోగ సమస్యను సంపూర్ణంగా



నిర్మూలించే విధంగా బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 4 లక్షల కోట్లు పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పరంగా నిరుద్యోగ యువతకు మేలు జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రపంచాన్నే శాసించే అమెరికా అధ్యక్షుడు, అమెరికాలో మోదీని సన్మానించిన విషయం చూసామన్నారు. కేసీఆర్ పాలనను ప్రజలు అసాహ్యించుకోడానికి 9 సంవత్సరాలు పడితే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు అసాహ్యించుకోడానికి 9 నెలలు పట్టిందన్నారు.

**కేసీఆర్ పాలనలోనే ఆర్థిక వ్యవస్థ కొల్లగొట్టారు.**

కేసీఆర్ పాలనలోనే ఆర్థిక వ్యవస్థ కొల్లగొట్టారని, కాంగ్రెస్ పార్టీని కానీ కేసీఆర్‌ను కానీ ప్రజలు నమ్మే విధంగా లేరని ఈటల రాజేందర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే బీఆర్ఎస్ అభివృద్ధి చేసిందని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందే కేసీఆర్ అని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పాలనపై కేసీఆర్ నిలదీయడం ఎంటన్నారు. కాళేశ్వరంపై అధికారులను ప్రశ్నిస్తే కేసీఆర్ చెప్పినట్లే చేసామని చెబుతున్నారు. కేంద్రంలో 70 మందికి పైగా మంత్రులు ఉంటే.. అందులో 30 మందికి పైగా బీసీలే ఉన్నారని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు.

# ఫోన్ ట్యాపింగ్ కథ కంచికేనా

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ం2గా ఉన్న ఎస్ఐబీ మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావుకు ఊరట లభించింది. పలు దఫాలుగా విచారణ చేపట్టిన నాంపల్లి సెషన్స్ కోర్టు ప్రణీత్‌రావుకు బెయిల్ మంజూరు చేసింది. ప్రణీత్‌రావు చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై లాయర్ ఉమామహేశ్వరరావు ఫిబ్రవరి 11న ప్రతీణ్ రావు తరఫున వాదనలు వినిపించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాంబశివారెడ్డి విచారణకు హాజరుకాకపోవడంతో పీపీ వాదనల కోసం విచారణ నేటికి వాయిదా వేశారు. ఈ కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఇతర నిందితులకు కోర్టులు బెయిల్ ఇచ్చాయని, ప్రస్తుతం ప్రణీత్ రావు ఒక్కరై జైలులో ఉన్నాయని లాయర్ ఉమామహేశ్వర రావు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ అడిషినల్ ఎస్పీ భుజంగరావు, మాజీ డీసీపీ ప్రభాకర్ రావులకు తెలంగాణ హైకోర్టు జనవరి 31న మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. మరో నిందితుడిగా ఉన్న అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసిందని వాదనలు వినిపించారు. ప్రణీత్ రావు బెయిల్ పిటిషన్ పై ఇరువైపుల వాదనలు విన్న జడ్జీ జస్టిస్ రమాకాంత్ రెగ్యూలర్ బెయిల్ మంజూరు చేశారు. బెయిల్ మంజూరు కావడంతో ప్రతీణ్ రావు త్వరలో విడుదల కానున్నారని ఆయన లాయర్ ఉమామహేశ్వరరావ తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతిపక్షనేతలైన కాంగ్రెస్, బీజేపీ నేతల ఫోన్లు ట్యాపింగ్ అయినట్లు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దర్యాప్తు మొదలుపెట్టింది. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఫోన్ ట్యాపింగ్ జరిగిందని దర్యాప్తులో తేలింది. ఎస్ఐబీలో ఉన్న 17 కంప్యూటర్లలో మొత్తం 42 హార్డ్ డిస్క్ లను తొలగించి.. వాటి స్థానంలో కొత్తవి అమర్చారు ప్రణీత్ రావు. పోలీస్ విచారణలో ప్రణీత్ రావు ఈ విషయాన్ని అంగీకరించారని అధికారులు తెలిపారు. మూసీ నదిలో నాలుగో బ్రిడ్జి కింద హార్డ్ డిస్క్ సంబంధించి శకలాలు గుర్తించారు. తమ వివరాలు తెలిసిపోతాయని హార్డ్ డిస్కులు ధ్వంసం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని సీరియస్ గా తీసుకుని ప్రత్యేక బృందం ఏర్పాటు



చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో మాజీ ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావును మొదట అరెస్ట్ చేసింది. విచారణలో తెలిసిన సమాచారం ఆధారంగా అనంతరం అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నను సైతం పోలీసులు అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతిపక్ష నేతల ఫోన్లతో పాటు సినీ సెలబ్రిటీలు, ఇతర ప్రముఖుల ఫోన్లు సైతం ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఫోన్లు ట్యాప్ చేసి వారికి సంబంధించిన రాజకీయ, వ్యక్తిగత విషయాలు తెలుసుకున్నారని విచారణలో ఒక్కో విషయం వెల్లడవుతోంది. అయితే ఈ కేసులో ఒక్కొక్కరిగా టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు, ఎస్పీ భుజంగరావు, తిరుపతన్నలకు కోర్టులు బెయిల్ మంజూరు చేశాయి. తాజాగా ప్రణీత్ రావుకు నాంపల్లి సెషన్స్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

## కిషన్‌రెడ్డితో కాంగ్రెస్ ఎమ్మెల్యే భేటీ..అందుకేనా..!



**హన్మకొండజిల్లా:** తెలంగాణ రాజకీయల్లో కీలక పరిణామం? చోటు చేసుకుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కలిశారు. కిషన్‌రెడ్డి ఆదివారం(ఫిబ్రవరి16) హన్మకొండ పర్యటనకు వచ్చినపుడు ఎమ్మెల్యే ఆయనను కలిసి చర్చిచండంతో పాటు అభివృద్ధి పనులపై వినతి పత్రం సమర్పించారు.ల వేయిస్తంభాల గుడిని అభివృద్ధి చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని, కుడా ఆధ్వర్యంలో చేపట్టే పనులకు అనుమతులు, నిధులు కేటాయించాలని కిషన్‌రెడ్డిని ఎమ్మెల్యే కోరారు. ఎలాంటి రాజకీయ బేషమ్యాలకు పోకుండా హన్మకొండ అభివృద్దే తన ధ్యేయం అని ఎమ్మెల్యే చెప్పారు. అభివృద్ధి కోసమే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిశానని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ రాజకీయాల్లో ఇది కొత్త ఒరవడిని సృష్టిస్తుందన్నారు.

# అమ్మ ఆస్తులు.. పూర్తయిన అప్పగింతలు





**బెంగళూరు :** తమిళనాడు మాజీ సీఎం, ప్రముఖ సినీ నటి జయలలితకు సంబంధించిన ఆస్తులు, ఆస్తి పత్రాలను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అందించే ప్రక్రియ శనివారం పూర్తయిందని కర్ణాటక ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిరణ్ జవళి వెల్లడించారు. ఈ కేసు విచారణకు ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు, ఆస్తులను భద్రపరచడంతోపాటు సిబ్బంది నియామకం తదితర అంశాలకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.13 కోట్లు కర్ణాటకకు అందాయని తెలిపారు. జయలలితకు చెందిన 27 కిలోల బంగారంతోపాటు వజ్రాభరణాల్లో 1.5 కిలోల పుత్తడి కత్తి సైతం ఉందని వివరించారు. ఇక పొలాలు, నివాసాలకు సంబంధించిన దస్తావేజులతోపాటు11,300 పట్టు చీరలు, 250 శాలువాలు, 12 రిఫ్రిజిరేటర్లు, 10 టీవీలు, 8 వీసీఆర్‌లు, 740 జతల పాదరక్షలు, 610 వెండి వస్తువులు, 27 కిలోల బంగారు ఆభరణాలు ఆ జాబితాలో ఉన్నాయని వివరించారు. 7,040 గ్రాముల 468 వజ్రఖచిత బంగారు ఆభరణాలతో కలిపి మొత్తం 1606 వస్తువులను ట్రంకు పెట్టెల్లో తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించామని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైందని చెప్పారు. శనివారానికి ఆ రాష్ట్ర అధికారులు సరిచూసుకోవడంతో న్యాయసంబంధ వ్యవహారం పూర్తయిందని తెలిపారు. తమిళ ప్రజల ఆరాధ్య దైవం అమ్మగా జయలలిత ఖ్యాతి పొందారు. 2016 డిసెంబర్‌లో ఆమె తీవ్ర అనారోగ్యంతో చెన్నై అపోలో ఆసుపత్రిలో మరణించారు. అయితే పలుమార్లు తమిళనాడు ముఖ్యమంత్రిగా పని చేశారు. అక్రమాస్తుల కేసులో ఆమె జైలుకు సైతం వెళ్లారు. ఆమె పాలనలో ఈ కేసులపై ప్రభావం చూపే అవకాశముందని డీఏంకే భావించింది. అందులో భాగంగా ఈ కేస్ను కర్ణాటకలోని పరప్పన్ అగ్రహారానికి బదిలీ చేశారు. నాటి నుంచి ఈ కేసు అంతా అక్కడి న్యాయ స్థానంలోనే సాగింది. అయితే జయలలిత ఆస్తులు తమకు చెందాలంటూ.. ఆమె వారసులం తామేనంటూ పలువురు బంధువులు న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించారు. కానీ జయలలిత ఆస్తులు తమిళనాడు ప్రభుత్వానికి చెందాలంటూ న్యాయస్థానం స్పష్టమైన తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో పరప్పన్ అగ్రహారంలోకి న్యాయ స్థానంలో ఉన్న ఆమెకు సంబంధించిన స్థిర, చర ఆస్తులకు.. ఆరు ట్రంక్ పెట్టల మధ్య తమిళనాడు అధికారులకు.. కర్ణాటక న్యాయ స్థానం.. ఆ రాష్ట్ర ఉన్నతాధికారుల సమక్షంలో అందజేశారు. భారీ భద్రత నడుమ జయలలిత ఆస్తులను తమిళనాడుకు తరలించారు.

## రైళ్లు రద్దు కాలేదు, ఫ్లాట్‌ఫాం మార్చలేదు...

# తొక్కిసలాటపై రైల్వే శాఖ వివరణ




**న్యూఢిల్లీ:** రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగి 18 మంది ప్రయాణికులు మరణించానికి దారితీసిన కారణాలపై భిన్న కథనాలు వినిపిస్తుండటంపై రైల్వే శాఖ వివరణ ఇచ్చింది. ఏ ఒక్క రైలును రద్దు చేయలేదని, ఫ్లాట్‌ఫాం మారుస్తున్నట్టు ఎలాంటి ప్రకటన కూడా చేయలేదని తెలిపింది. ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు 14వ నెంబర్ ఫ్లాట్‌ఫాం మీదకు భారీ సంఖ్యలో ప్రయాణికులు గుమిగూడటంతో ఊహించని విధంగా తొక్కిసలాట చోటుచేసుకుందని నార్తరన్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి హిమాన్షు శేఖర్ ఉపాధ్యాయ్ తెలిపారు. ''షెడ్యూల్డ్ రైళ్ల ఫ్లాట్‌ఫాంలను మారుస్తూ మేము ఎలాంటి ప్రకటన చేయలేదు. రైళ్లను కూడా రద్దు చేయలేదు. నిజానికి రద్దీకి అనుగుణంగా సాయంత్రం సమయంలో 5 నుంచి 6 ప్రత్యేక రైళ్లు కూడా వేశాం'' అని ఉపాధ్యాయ్ తెలిపారు. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌కు పెద్దఎత్తున ప్రయాణికులు తరలివస్తుండటంతో ఢిల్లీ నుంచి ప్రయాగరాజ్‌కు 350 నుంచి 400 రైళ్లు నడుపుతున్నామని చెప్పారు. అయితే ప్రమాద (తొక్కిసలాట) సమయంలో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఫ్లాట్‌ఫాం 14 నుంచి 12కు ఫుట్‌బ్రిడ్జి మీదుగా కదులుతుండటంతో అనూహ్యంగా తొక్కిసలాట చోటు చేసుకుందన్నారు. కాగా, ఫ్లాట్‌ఫాం 14, 15కు దారితీసే ఫుట్ ఓవర్ బ్రిడ్జి మెట్ల మీద నుంచి ఒక ప్రయాణికుడు జారి పడటం, వెనుకనున్న వాళ్లు అతనిపై పడటంతో ఒక్కసారిగా పరిస్థితి అదుపుతప్పిందని, ఘోర విషాదం చోటుచేసుకుందని రైల్వే అధికారులు తెలిపారు. రైళ్లు బయలుదేరడంలో జరిగిన జాప్యం, ప్రతి గంటకు 1,500 టికెట్ల అమ్మకాలతో రైల్వేస్టేషన్ వద్ద విపరీతమైన రద్దీ నెలకొని ప్రయాణికుల్లో గందరగోళం నెలకొన్నట్టు మరికొన్ని వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు, తొక్కిసలాట ఘటనపై అత్యున్నత స్థాయి దర్యాప్తునకు రైల్వే శాఖ ద్విసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన కమిటీ రైల్వే స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌లను, ఇతర డాక్యుమెంట్లను పరిశీలిస్తోంది. త్వరలోనే నివేదికను సమర్పించనుంది. దీనితో పాటు మృతుల కుటుంబాలకు రైల్వే శాఖ రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.1 లక్ష చొప్పున పరిహారం ప్రకటించింది.

# భారత్‌కు అమెరికా భారీ షాక్!



భారత ప్రధాని నరేంద్రమోదీ అమెరికా పర్యటన అలా ముగించి ఇలా వచ్చారో లేదో.. భారత్‌కు ట్రంప్ భారీ షాకిచ్చారు. భారత్, బంగ్లాదేశ్‌తో పాటు ప్రపంచంలోని పలు దేశాలకు అందించే మిలియన్ డాలర్ల నిధుల్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ శాఖ బాధ్యతలను ప్రపంచ కుబేరుడు ఎలోన్ మస్క్ నిర్వహిస్తున్నారు. ఎలోన్ మస్క్ సూచన మేరకు ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రధాని మోదీ గతవారం అమెరికాలో పర్యటించారు. పర్యటన సమయంలో ఇద్దరు నేతలు అమెరికా-భారత్ సంబంధాలను బలోపేతం చేసేలా ముఖ్యమైన ప్రకటనలు చేశారు. ఈ తరుణంలో ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం భారత్‌లో ఓటర్ల సంఖ్యను పెంచడానికి కేటాయించే 21 మిలియన్ల డాలర్లను, బంగ్లాదేశ్ రాజకీయాల్ని బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన 29 మిలియన్ల డాలర్ల మొత్తాన్ని తగ్గించాలని అమెరికా నిర్ణయించినట్లు ఎలోన్ మస్క్ ప్రభుత్వ సామర్థ్య విభాగం డోజ్ ఆదివారం ప్రకటించింది. ఇదే విషయాన్ని డోజ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. కాగా, డొనాల్డ్ ట్రంప్‌ని ప్రధాని మోదీని కలిసిన కొద్ది రోజులకే ఈ ప్రకటన రావడం గమనార్హం. మరోవైపు బంగ్లాదేశ్‌లో, రాజకీయ స్థిరత్వాన్ని పెంపొందించడానికి, ప్రజాస్వామ్య పాలనను మెరుగుపరచడానికి రూపొందించిన కార్యక్రమంలో భాగంగా అమెరికా ఆదేశానికి 29 మిలియన్ డాలర్లను కేటాయిస్తుండేది. తాజాగా ఆ నిధుల కేటాయింపుల్ని ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసింది. హింసాత్మక నిరసనల మధ్య షేక్ హసీనా నేతృత్వంలోని ప్రభుత్వాన్ని సైన్యం గద్దె దించడంతో దేశం రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. హసీనా భారత్‌కు వచ్చిన తర్వాత మొహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఇప్పుడు దేశాన్ని పాలిస్తున్నప్పటికీ, రాజకీయ అస్థిరత కొనసాగుతోంది. అమెరికా ప్రభుత్వం తన విదేశాంగ విధాన వ్యూహాల్లో భాగంగా వివిధ దేశాలలో ప్రజాస్వామ్యం, పాలన కార్యక్రమాలకు తరచుగా నిధులు సమకూరుస్తుంది. అలా భారత్‌లో ఓటింగ్ శాతం పెరగడానికి డబ్బు ఖర్చు చేస్తుంది. తద్వారా ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకుంటుంది. భారత్‌లాంటి ప్రజాస్వామ్య దేశాల్ని ప్రోత్సహించడం ద్వారా చైనా వంటి దేశాల ప్రభావాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంటుంది.

## ఈ తప్పు మరో చోట జరగకూడదు.. ఢిల్లీ తొక్కిసలాట తర్వాత ఆ పని చేస్తున్న రైల్వే శాఖ..



ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో ఎంతమంది తమ అయినవారిని కోల్పోయారో తెలియదు. ప్రస్తుతం, తొక్కిసలాట ఎలా జరిగింది. ఏ నిర్లక్ష్యం వల్ల ఈ దుర్ఘటన జరిగిందనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తొక్కిసలాటలో ఉన్న వారిలో 90 శాతం మంది మహా కుంభమేళా కోసం ఢిల్లీ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్న వారే. ఇప్పటికే మహాకుంభమేళా చుట్టుపట్ల వేలాది వాహనాలు నిలిచిపోయాయి. 15 నిమిషాలు వెళ్లాల్సిన దూరానికి కూడా దాదాపు 3 గంటలు పడుతోంది. ఇంత ట్రాఫిక్ ఉన్నప్పటికీ భక్తుల రద్దీ పెరుగుతుందే తప్ప తగ్గటం లేదు. త్రివేణి సంగమంలో భక్త సంద్రాన్ని నియంత్రించేందుకు యూపీ ప్రభుత్వం ఒక పక్క చర్యలు తీసుకుంటుంటే, మరో పక్క రైల్వే శాఖ కూడా అప్రమత్తమైంది. గత నెల జనవరి 13న ప్రారంభమైంది మహాకుంభమేళాలో ఇప్పటివరకూ 50 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నాలు చేశారు. ఫిబ్రవరి 26 చివరిరోజు కావడంతో ప్రయాగ్‌రాజ్‌కు జనప్రవాహం ఆగటం లేదు. వేలాది వాహనాలు త్రివేణి సంగమం వైపు కదలుతున్నాయి. దీంతో ప్రయాగ్‌రాజ్ పొరుగు నగరాల్లోనూ భారీ ట్రాఫిక్ నెలకొంది. ప్రయాగ్‌రాజ్ సరిహద్దులో ఉన్న మధ్యప్రదేశ్‌లోని రేవాలో కూడా వాహనాల సంఖ్య గత 24 గంటల్లో విపరీతంగా పెరిగింది. ఢిల్లీ రైల్వేస్టేషన్లో తొక్కిసలాట ఘటనలో శనివారం 18 మంది చనిపోవడంతో ట్రాఫిక్ మరింత పెరిగింది. దీంతో ఉత్తరప్రదేశ్, బీహార్‌లోని వివిధ రైల్వే స్టేషన్లలో అలర్ట్ ప్రకటించారు. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ మహా కుంభమేళా వ్యవధిని పొడిగించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. గత సంవత్సరాల్లో మహా కుంభమేళా 75 రోజులు కొనసాగిందని, ప్రస్తుత షెడ్యూల్ తక్కువగా ఉందని ఆయన పేర్కొన్నారు. రోడ్లపై అధిక సంఖ్యలో భక్తులు ఉన్నారని వారందరికీ పుణ్యస్నానాలు స్నానాలు చేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

## కూలిన బతుకులు!



ఓ బంగారు గని కుప్పకూలిన ఘటన ఆఫ్రికా దేశం మాలిలో చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 42 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మాలి దేశంలోని తూర్పు ప్రాంతంలో ఉన్న ఈ గని కొందరు చైనా జాతీయులు నిర్వహణలో ఉంది. ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడడంతో కార్మికులు తప్పించుకోలేకపోయారు. కొన్ని రోజుల వ్యవధిలోనే మాలి దేశంలో జరిగిన రెండో ప్రమాదం ఇది. గత నెల 29న కౌలికోరో ప్రాంతంలో ఉన్న ఓ బంగారు గని కూలిపోయిన ఘటనలోనూ ప్రాణనష్టం జరిగింది. మాలి దేశం ఆఫ్రికాలోని మూడో అతి పెద్ద బంగారం ఉత్పత్తిదారుగా ఉంది. ఇక్కడి జనాభాలో 10 శాతం కంటే ఎక్కువమంది గనులపై ఆధారపడి మనుగడ సాగిస్తున్నారు. గతేడాది కూడా మాలిలో ఓ బంగారు గని కుప్పకూలి 70 మంది మృత్యువాతపడ్డారు. ఇక్కడి గనుల్లో చాలా వరకు అనుమతులు లేనివే ఉంటాయని తెలుస్తోంది.

## మహాకుంభమేళాపై లాలూ ప్రసాద్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ:** మహాకుంభమేళాపై ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'మహాకుంభమేళాకు అసలేమైనా అర్థం..పర్థం ఉందా..?అది ఓ అర్థం లేని వ్యవహారం' అని లాలూ అన్నారు. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది దుర్మరణం చెందడం దురదృష్టకరమని వ్యాఖ్యానించే సందర్భంలో లాలూ మహా కుంభమేళాపై ఈ వ్యాఖ్యలు చేశారు. రైల్వేశాఖ విఫలమవడం వల్లే న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగిందన్నారు. రైల్వే మంత్రి దీనికి పూర్తిగా బాధ్యత వహించాల్సిందేనన్నారు.అయితే మహాకుంభమేళాపై లాలూ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు విరుచుకుపడుతున్నారు. ఈ వ్యాఖ్యలు హిందువులపై ఆర్జేడీ వైఖరిని స్పష్టం చేస్తున్నాయని బీహార్ బీజేపీ చీఫ్ మనోజ్‌శర్మ అన్నారు. బిహార్ ఎన్నికలు వస్తున్న వేళ ఓ వర్గం వారిని బుజ్జగించేందుకే లాలూ మహాకుంభమేళాను టార్గెట్ చేశారని శర్మ మండిపడ్డారు.

## ఢిల్లీ కొత్త సీఎంపై నిరీక్షణకు తెర



న్యూఢిల్లీ:ఢిల్లీ కొత్త సీఎం ఎవరన్నదానిపై సస్పెన్స్‌కు తెరపడనుంది. సీఎం పేరును సోమవారం(ఫిబ్రవరి17) జరిగే బీజేపీ కీలక నేతల భేటీలో ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ సీఎంగా ఎవరిని నిర్ణయించాలన్నదానిపై బీజేపీ హైకమాండ్ ఇప్పటికే చర్చోపచర్చలు సాగిస్తోంది. దీనిపై పార్టీ ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే సీఎం ఎవరన్నది బయటికి పొక్కకుండా బీజేపీ నేతలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.ఈ విషయంపై ఎవరూ నోరు విప్పకుండా అధిష్టానం స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు చెబుతున్నారు.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్‌పై విజయం సాధించిన పర్వేష్‌వర్మకే ఢిల్లీ సీఎంగా ఎక్కువ అవకాశాలున్నాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. పర్వేష్‌వర్మతో పాటు ఢిల్లీ మాజీ ప్రతిపక్షనేత విజేందర్‌గుప్తా, ఢిల్లీ బీజేపీ మాజీ చీఫ్ సతీష్ ఉపాధ్యాయ,ఢిల్లీ బీజేపీ జనరల్ సెక్రటరీ ఆశిష్ సూద్,ఆర్‌ఎస్‌ఎస్ నేత జితేంద్ర మహాజన్ పేర్లు సీఎం రేసులో పరిశీలనలో ఉన్నాయి. కాగా, ఫిబ్రవరి 5న జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీపార్టీపై బీజేపీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ గెలుపుతో 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో బీజేపీ అధికారం చేపట్టనుంది. కాగా, ఢిల్లీ సీఎం ఎవరనే సస్పెన్స్‌కు మరో 2-3 రోజుల్లో తెరపడే అవకాశం ఉందని బీజేపీ ఎంపీ యోగేంద్ర చందోలియా శనివారంనాడు తెలిపారు. ఒకటి రెండ్రోజుల్లో కీలకమైన పార్లమెంటరీ సమావేశం జరుగుతుందని, అనంతరం దీనిపై స్పష్టత వస్తుందని తెలిపారు. దాదాపు 27 ఏళ్ల నిరీక్షణకు తెరపడి ఫిబ్రవరి 5న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగురవేసింది. 70 అసెంబ్లీ స్థానాల్లో 48 స్థానాలను బీజేపీ గెలుచుకోగా, గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో తిరుగులేని హవా సాగించిన ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం 22 స్థానాలకే పరిమితమైంది. ఆ పార్టీ ఛీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు పలువురు కీలక నేతలు ఓటమి చవిచూడగా, మాజీ ముఖ్యమంత్రి అతిషి మాత్రం తన సీటును నిలబెట్టుకున్నారు.

## బెంగళూరులో దారుణం.. టోల్‌గేట్ వద్ద అరాచకం!

**బెంగళూరు:** కర్ణాటకలోని బెంగళూరులో దారుణ ఘటన చోటుచేసుకుంది. టోల్‌గేట్ వద్ద ఓ వ్యక్తిని కారు కొంత దూరం లాకెళ్లి పడేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. కర్ణాటకలోని నెలమంగళలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. టోల్‌బూత్ వద్ద ఇద్దరు వ్యక్తుల మధ్య వాగ్వాదం జరిగింది. టోల్‌గేట్ వద్ద ఓ కారును మరో కారు ఓవర్ టేక్ చేయడంతో సదరు కారులో? వ్యక్తి.. ముందుకు వచ్చి కారులో ఉన్న వ్యక్తిని ప్రశ్నించారు. దీంతో, టోల్‌బూత్‌లో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో ముందు కారులో డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి ఆవేశంతో రగిలిపోయాడు. ఈ క్రమంలోనే కారు స్టార్ చేసి.. వాగ్వాదానికి దిగిన వ్యక్తి కాలర్ పట్టుకుని కారును ముందుకు నడిపాడు. ఆ తర్వాత కారు ఆ వ్యక్తిని దాదాపు 50 మీటర్ల దూరం కారు ఈడ్చుకెళ్లింది. కొంత దూరం వెళ్లాక అతడిని వదిలిపెట్టడంతో ఆయన కిందపడిపోయాడు. కారు డ్రైవర్ మాత్రం ఆగకుండా వెళ్లిపోయాడు. ఇక, దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

# ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తి చేయాలి...

## ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు ఉమా మహేష్..

ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్):
క్రాంతి ఆటో యూనియన్ ఐడిపిఎల్ అడ్డ ఆటో డ్రైవర్ల సమావేశం ఆదివారం గాంధీనగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ విచ్చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు 12000 ఇస్తామని అదేవిధంగా మీటర్ చార్జీలు పెంచుతామని అనేక వాగ్దానాలు చేసి నేడు వాటిని అమలు చేయడంలో విఫలమైందని వెంటనే ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని కార్మిక సంఘాల్లో ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు గతంలో సమ్మె నోటీసులు ఇస్తే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆటో డ్రైవర్ల సమస్యలను నెరవేరుస్తామని



చెప్పి నేటికీ రెండు నెలలు గడిచినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడం సిగ్గుచేటు కరమని, రాష్ట్ర ఏఐటీయూసీ ఆటో డ్రైవర్ యూనియన్ ఇచ్చిన పిలుపుమేరకు రానున్న రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో కూడా అన్ని ఆటో కార్మిక సంఘాలను కూడగట్టుకుని పెద్ద ఎత్తున ఆందోళనను నిర్వహిస్తామని, కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండు బూర్జువా పార్టీలే కాబట్టి అవి రెండు కూడా వ్యాపారవర్గ దృష్టితోటే పరిపాలన సాగిస్తాయని కార్మిక వర్గ దృక్పథంతో పనిచేయవని కార్మిక వర్గ దృష్టితోటి పనిచేసే ఏకైక పార్టీలు కమ్యూనిస్టు పార్టీలేనని కాబట్టి కార్మిక వర్గ లోకమంతా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఉంటే కార్మికులే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఈ విషయాన్ని కార్మిక నాయకులందరూ ప్రజలకు తెలియజేసేలా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కుమార్,ఆటో యూనియన్ నాయకులు విజయ్,చందు,పూర్ణ, యాదన్న,నగేష్, తోపాటు సుమారు 40 మంది ఆటో యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

# ఎస్ టి.మాథ్యూస్ చర్చ్ ను ప్రారంభోత్సవ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 129 డివిజన్ సంజయ్ గాంధీ నగర్ పరధిలోని షాపూర్ నగర్ లో నూతనంగా నిర్మించిన ఎస్ టి.మాథ్యూస్ చర్చ్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఈ కార్యక్రమంలో కెఅనిల్ కుమార్ (బుజ్జి),130 డివిజన్ అధ్యక్షులు సోమన్నాగారి శ్రీధర్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి,సల్మాన్ రాజ్,భాస్కర్ రెడ్డి,గొల్ల జాన్,రోషన్,నర్సింహా రెడ్డి,శ్యామ్,చారీ పాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.ం

# బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి. కిషన్ రెడ్డి తో సమావేశమైన తెలంగాణ లెక్చరర్స్ ఫోరమ్(టిఎల్ ఎఫ్)నాయకులు..

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులకు మద్దత్తు తెలిపిన తెలంగాణ లెక్చరర్స్ ఫోరమ్ టి ఎల్ ఎఫ్

ప్రజావినికిడి,(షాద్ నగర్):
రాష్ట్రం లో జరుగుతున్నటువంటి వరంగల్ ఖమ్మం నల్గొండ ఉమ్మడి జిల్లా మరియు కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ ఉమ్మడిజిల్లాల టీచర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి టి ఎల్ ఎఫ్ నాయకులతో సమావేశమయ్యారు.ఇందులో భాగంగా రాష్ట్రం లోని కళాశాలలో పాఠశాలలో పని చేస్తున్నటువంటి టీచర్ల సమస్యలను టి ఎల్ ఎఫ్ నాయకులు కిషన్ రెడ్డి దృష్టికి తీసుకురావడం జరిగింది.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి స్పందిస్తూ ఉపాధ్యాయుల సమస్యల పట్ల భారతీయ జనతా పార్టీ



ఎప్పుడూ అండగా ఉంటుందని,ఈ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులకు మద్దత్తుగా టి ఎల్ ఎఫ్ నాయకులను కోరారు .తెలంగాణా ఉద్యమం నుండి కూడా ఎంతో క్రమశిక్షణ ఉన్నటువంటి సంస్థటి ఎల్ ఎఫ్ అని,తెలంగాణా వచ్చినప్పటినుండి ఇప్పటి వరకు కూడా సమస్యలు తీరలేవవని టి ఎల్ ఎఫ్ నాయకులు అన్నారు.మా సమస్యలను బిజెపి పరిష్కరిస్తుందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి గారు హామీ ఇచ్చారు . గతములో కూడా టి ఎల్ ఎఫ్ కు అనేక సందర్భాలలో బీజేపీ అండగా నిలిచిందని టి ఎల్ ఎఫ్ నాయకులు ఈ సందర్భముగా గుర్తు చేశారు.ఈ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులకు మద్దతుగా నిలిచి,వారి గెలుపు కోసం కృషి చేస్తామని టి ఎల్ ఎఫ్ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో టి ఎల్ ఎఫ్ ఎల్ ఎగ్రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు సిద్దేశ్వర్ ,డాక్టర్ యాదయ్య నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీరేణుక ఎల్లమ్మ దేవి రజతోత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్..



ప్రజావినికిడి,(కుత్బుల్లాపూర్): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలో శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి రజతోత్సవంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ శ్రీశ్రీ ఎల్లమ్మ తల్లి జాతరలో పాల్గొన్నారు.అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలమధ్యఅమ్మవారిఆశీస్సులుస్వీకరించారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ,శ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరూ పై ఉండాలని కోరారు.అమ్మవారి రజతోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ముత్యపాక సహదేవ్, పెరిమాల రవి, ముత్యపాక నర్సింగ్ రావు,బైగన్ నర్సింగ్ రావు,తుపాకుల నర్సింగరావు, తుపాకుల సురేష్, పెరిమాల రాకేష్, మరియు చిత్తారమ్మ ఆలయ చైర్మన్ అంతయ్య గౌడ్ గారు, ఇంద్రసేనారెడ్డి,ఆర్ బాలరాజ్,చౌడ శ్రీనివాస్,నాగిళ్ల శ్రీనివాస్ కమిటీ సభ్యులు,ప్రజలు, భక్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల పేరుతో పుట్టగొడుగుల కొత్త పార్టీలు

- ఎన్నికల ముందే హడావుడి తర్వాత అడ్రస్ గల్లంతు
- పార్టీ పేరుతో ఇదో రకం వసూలు దందా
- ప్రజాదరణ లేకపోయిన బిఫామ్ అమ్ముకోవడమే లక్ష్యం
- ప్రజాసేవ అంటూ టికెట్ల రూపంలో ప్రజాధనం లూటీయే లక్ష్యం
- ప్రజలు చిన్నా చితక కొత్త పార్టీలను నమ్మి మోసపోవద్దు..
- తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ బడుగులను మోసం చేస్తోందా.?
- ఎన్నికల సమయంలోనే తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ ఎగురుతుంది..
- అటు తరువాత మటుమాయం అవుతుంది
- ఎలక్షన్ల కోసమే తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ పుట్టుకొచ్చిందా.?
- పత్తాలేని పార్టీని నమ్మి రాష్ట్ర ప్రజలు మోసపోవద్దు తస్మాత్ జాగ్రత్త..









ప్రజావినికిడి (హైదరాబాద్):ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చిన్నచితక పార్టీల పేరుతో కొంతమంది వసూల్ దందా చేయడం ఒక ఆనవాయితీగా మార్చుకున్నారు కొంతమంది విలువలు లేని నాయకులు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చిన్నాచితక పార్టీ ఓనర్లు ఇక దండుకోవడమే లక్ష్యంగా ప్రజలకు తమ పార్టీ ఉందన్నట్లుగా చిన్నచిన్న ప్రచారాలు, ప్రెస్ మీట్ లు పెట్టడంతో పాటు ఇక బీ ఫామ్ ఇస్తామంటూ ఇదోరకంగా వసూల్ దందా ను ప్రారంభిస్తున్నారు. ఇన్ని సంవత్సరాలలో వీళ్ళు ఎక్కడ ఉన్నారో అడ్రస్ కూడా తెలియదు. కానీ ఎలక్షన్ రాగానే టక్కున గద్దల్ల వాలిపోతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అందిన కాడికి డబ్బులు దండుకొని జెండా లేపే పార్టీ తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ అని కాంగ్రెస్, బిఆర్ఎస్,బిజెపి పార్టీ నాయకులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల కోసమే ఈ కొత్త పార్టీ పుట్టుకొచ్చిందని ఎన్నికల తర్వాత నామరూపాలు లేకుండా పోతుందన్నారు. తెలంగాణ ప్రజారాజ్యం పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరని కచ్చితంగా తేల్చి చెప్పారు.బడుగు బలహీన వర్గాలకు సేవ చేస్తామనే ముసుగులో ప్రజలకు కుచ్చుటోపి పెట్టే తెలంగాణ ప్రజారాజ్యం పార్టీని ప్రజలు గుసగుసలాడుతున్నారు.ఒక్క రోజు ఒక్క సమస్య పైన కూడా పోరాడిన సంఘటనలు లేవని కేవలం ఎన్నికల లబ్ధి కోసమే ఏర్పాటయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. "ప్రతివత పరమాన్నం వండితే తెల్లరగా చల్లారదన్నట్టుగా" రాష్ట్ర ప్రజలు తీవ్రంగా తెలంగాణ ప్రజారాజ్యం పార్టీని వ్యతిరేకిస్తున్నారు. ఇలాంటి పార్టీ ఒకటి ఉందా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు ఏ రోజు చూడని కొత్త పార్టీ ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. "ట్రైన్ కు దారం కట్టి" తెలంగాణ ప్రజారాజ్యం పార్టీని ఢిల్లీకి లాగినట్టు..ప్రజల నమ్మకం కోసం తూతా మంత్రంగా ప్రెస్ మీటింగులు పెట్టి వివిధ దినపత్రికలలో వార్తలు వ్రాయించుకొని మీడియా మిత్రులకు సైతం పంగనామం పెట్టి మొండి చెయ్యి చూపించడం ఆనవాయితీగా పెట్టుకున్న తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ అని పలు రాజకీయ పార్టీ నాయకులు దుమ్మెత్తి పోశారు. పొరపాటున కూడా అభ్యర్థులు ఈ పార్టీ ముసుగులో పడి డబ్బు మోసపోవద్దని సూచిస్తున్నారు ఇలాంటి చిన్నాచితిగా పార్టీల పేరుతో నాయకులు కోట్లు గడిస్తున్నారని వాటి జోలికి వెళ్లకూడదని పేర్కొన్నారు.

# దేవ దేవా మల్లన్న... ఆది దేవా మల్లన్న..

- బండోని గూడా గ్రామంలో మల్లన్న స్వామి కళ్యాణం..
- గనంగా మల్లన్న స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవం..
- వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి..



ప్రజావినికిడి,(షాద్ నగర్):
దేవదేవా మల్లన్న ఆది దేవా మల్లన్న మమ్మల్ని చల్లంగా చూసి, సురక్షితంగా ఉంచి, క్షేమంగా కాపాడి, పాడిపంటలు సమృద్ధిగా పండేటట్లు, మా ఇంటి లోగిళ్లన్నీ కళకళలాడుతుండే విధంగా ఆశీర్వదించు నాయనా అంటూ బండోని గూడా గ్రామస్తులు మల్లన్న స్వామి దేవాలయ నాలుగవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవాన్ని జరిపించారు. మల్లన్న



స్వామి కళ్యాణ మహోత్సవానికి ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామస్తులు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డిని సాదరంగా ఆహ్వానించి సన్మానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఆ దేవదేవుడైన మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఓంకార స్వరూపుడైన మల్లన్న స్వామి దీవెనలతో బండోని గూడెం ప్రజలతోపాటు నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని, కల్మషం లేకుండా సమాజంలో పేరు ప్రఖ్యాతులతో అభివృద్ధి చెందాలని, ఆ స్వామి కరుణాకటాక్షాలతో ఆయురారోగ్యంగా జీవించి, ప్రజలందరి ఇండ్ల లోగిళ్ళన్ని సిరి సంపదలతో తులతూగాలని, ఆ దేవదేవునికి కళ్యాణ మహోత్సవం జరిపించే అదృష్టం మనందరికీ దక్కిందని అందుకు అందరం సంతోషపడాలన్నారు.ఈ కార్యక్రమం లో పిఎసిఎస్ చైర్మన్ గొర్లపల్లి అశోక్,మాజీ సర్పంచ్ లు జెట్ట కుమార్,గోవింద్ అశోక్,బిఆర్ఎస్ నాయకులు బండ మల్లేష్,జంగిలి కుమార్ సాములయ్య,నర్సప్పగూడ భూపాల్,బండ నర్సిములు, బుచ్చయ్య,జాలగూడెం శ్రీశైలం, పాండు,జెట్టా ఆర్కే కుమార్,బండ కుమార్,శ్రీను, శ్రీరాములు,మల్లేష్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేట డివిజన్ సమతపూరి కాలనీలో పర్యటించిన స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్..

ప్రజావినికిడి సమతపూరి: కాలనీలో వున్నటువంటి సమస్యలపైన ఈరోజు వారు కాలనీ వాసులతో కలిసి ప్రతి గల్లి తిరిగి సమస్యలను పరిశీలించారు, కాలనీలో శానిటైజేషన్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు, కాలనీలో రోడ్లన్నీ సుబ్రంగా ఉండేలా చూడాలని చెత్త కుప్పలను ఎప్పటికీ అప్పుడు తీసేయాలని సానిటైజేషన్ సూపర్వైజర్ లక్ష్మయ్యకు తెలియజేశారు, అనంతరం కాలనీలో డ్రైనేజ్ సమస్యలను పరిశీలించారు, కొన్ని మాన్ హెూల్స్ పాడైపోవడంతో జలమండలి అధికారులతో మాట్లాడటం జరిగింది. డ్రైనేజ్ మాన్ హెూల్స్ అన్ని కూలిపోయే విధంగా ఉన్నాయని వెంటనే వాటిని మర్మతులు చేయాలని తెలియజేశారు. మరియు కాలనీలో ఉన్నటువంటి వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ పర్యటనలో కాలనీ అధ్యక్షుడు నరేందర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

# ప్రజా సమస్యలను తీర్చినప్పుడు కలిగే సంతృప్తి, మరెందులోనూ రాదు

## - మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.

- ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రజావాణికి అధికారులను పిలవలేదు.
- మంత్రిగా రాష్ట్రవ్యాప్తంగా బాధ్యతలు మోస్తున్నే.. నల్లగొండ సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్నా..
- నల్లగొండ ప్రజల కోసం ఎల్లవేళల నా గుమ్మం తెరిచే ఉంటుంది.
- RRR హైదరాబాదు రూపురేఖలు మార్చేస్తుంది.
- రెండు సంవత్సరాల లోపే శ్రీశైలం సొరంగ మార్గం పనులు పూర్తి..
- నల్గొండ ప్రజలకు నా శుభాకాంక్షలు.. అంగడిపేట నుంచి నడుస్తున్న టన్నులు బోరింగ్ మిషన్ 840 మీటర్ల సొరంగాన్ని తవ్వడం జరిగింది.
- నల్లగొండ సమగ్రాభివృద్ధే నా ధ్యేయం

-రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ప్రజావినికిడి,(నల్గొండ):
మంత్రిగా ఎంత బిజీగా ఉన్నప్పటికి నల్లగొండ నియోజకవర్గ ప్రజల కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని కొనసాగిస్తానని అన్నారు మంత్రి %ఎ% కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఈ రోజు శ్రీనగర్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో
ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించిన మంత్రి వివిధ ప్రాంతాల నుంచి సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.ఆర్ధిక ఇబ్బందులతో కాలేజీ ఫీజులు కట్టలేక, ఆసుపత్రుల్లో చికిత్స కోసం వచ్చినవారికి మానవత్వంతో వారి సమస్యలు పరిష్కరించి.. వారి మోముల్లో సంతోషం నింపారు.రాష్ట్ర కెబినేట్ మంత్రిగా రాష్ట్రవ్యాప్త బాధ్యతలతో ఈ మధ్య ప్రజావాణి కార్యక్రమం కొంత ఆలస్యం జరిగిందన్న మంత్రి.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ దృష్ట్యా ప్రజావాణి కార్యక్రమానికి అధికారులను ఎవరిని పిలవలేదని పేర్కొన్నారు.అనంతరం విలేకరులతో మాట్లాడిన రాష్ట్ర రోడ్ల, భవనాలు, సినిమాటోగ్రాఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. హైదరాబాద్ చుట్టూరా నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు(%===%) నిర్మాణంతో తెలంగాణ రాష్ట్ర ప్రగతి మరో మెట్టు ఎక్కుతుందని ఆయన అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు పనులకు ఉత్తర భాగానికి టెండర్లు పిలిచామని,దక్షిణ భాగానికి సంబంధించి డీపీఆర్ కు టెండర్లు పిలవడం జరిగిందన్న మంత్రి త్వరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. గతంలో వైయస్సార్ సీఎంగా ఉన్నప్పుడు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించడం దానికి దగ్గర్లోనే రాజీవ్ గాంధీ ఎయిర్ పోర్ట్, ఫైనాన్స్ డిస్ట్రిక్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అదే విధంగా నగరం నుంచి శంషాబాద్ సఎయిర్ పోర్ట్ కు 13 కిలోమీటర్లు పొడవైన పీవీ నరసింహారావు ఫ్లైఓవర్ కట్టిన తర్వాత హైదరాబాద్ కు మల్టీనేషన్ కంపెనీలు వచ్చాయని పేర్కొన్నారు.
బెంగళూరులో ఎయిర్ ఫోర్టు నుంచి ఐటీ కంపెనీలకు వెళ్లాలంటే ట్రాఫిక్ వలన రెండు మూడు గంటల సమయం పడుతుందని తెలిపిన మంత్రి. హైదరాబాదులో అలాంటి సమస్య తలెత్తకుండా.. ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారుగత ఎన్నికల ముందు కేసీఆర్ ఔటర్ రింగ్ రోడ్డును కమిషన్ కోసం అమ్ముకున్నాడని విమర్శించిన మంత్రి.. రూ.30 వేల కోట్లతో రీజినల్ రింగ్ రోడ్డు పనులను ప్రారంభించాల్సి ఉన్న నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు.రీజినల్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డుకు నడుము నిర్మిస్తున్న రేడియల్ రోడ్స్ తో తెలంగాణ రూపురేఖలు మారడంతో పాటు హైదరాబాదు ట్రాఫిక్ సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందని మంత్రి తెలిపారు.దశాబ్దాల నల్గొండ జిల్లా సాగు, త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు శ్రీశైలం టన్నెల్ బేరింగ్ మిషన్ పనులు ప్రారంభమయ్యాయని తెలిపిన మంత్రి.. అమెరికా నుంచి రాబిన్స్ బోరింగ్ కంపెనీ నుంచి వచ్చే మరో బేరింగ్ మిషన్ మద్రాసు పోర్టు వరకు వచ్చిందని తెలిపారు.రెండు సంవత్సరాల్లో శ్రీశైలం సొరంగం మార్గం పనులను పూర్తి చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీశైల టన్నెల్, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆయన ధ్వజమెత్తారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టులకు తగిన నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. కెసిఆర్,కేటీఆర్ లతో పాటు కొంతమంది కులగణలో పాల్గొనకపోవడంపై విలేకర్లు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. రాష్ట్ర పౌరులుగా అందరూ సర్వేలో పాల్గొనలని హితవు పలికారు. ఐదుసార్లు తనను ఎమ్మెల్యేగా గెలిపించిన నల్లగొండ నియోజక వర్గ ప్రజలకు తాను ఎల్లవేళల రుణపడి ఉంటానన్న మంత్రి.. ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. నల్లగొండ సమగ్రాభివృద్దే తన ధ్యేయమని పేర్కొన్నారు.అన్ని రంగాలలో నల్లగొండలో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. ఇప్పటికే నల్గొండ పట్టణంతో పాటు నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను ప్రారంభించామని అవన్నీ పూర్తయిన తర్వాత నల్గొండ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

# పసుపు ఎగుమతుల ద్వారా విదేశీ మారకం

**ప్రపంచ పసుపు ఉత్పత్తిలో 70శాతం భారత్‌దే - మరిన్ని ప్రోత్సాహకాలు అందిస్తే దూసుకెళ్లడం ఖాయం**



నిజామాబాద్,ఫిబ్రవరి16 ప్రజావినికిడి
నిజామబాద్ కేంద్రంగా పసుపు బోర్డుల ఏర్పాటైనందున ఇక పసుపును అంతర్జాతీయంగా ఉత్పత్తి చేసి, ఎగుమతులు చేసేలా ప్రోత్సహించాల్సి ఉంది. ఇందుకు బోర్డు కార్యాచరణ కు దిగాలి. పసుపు బోర్డుకి సంబంధించిన ఈ విజయగాథ నిజామాబాద్ రైతుల పోరాట పటిమను, కృషిని, పట్టుదలని ప్రతిబింబిస్తోంది. దేశవ్యాప్తంగా ఇతర రైతులకు కూడా ఇది ఒక ఆదర్శంగా నిలిచింది. నిజామాబాద్‌తో పాటు జగిత్యాల, ఆదిలాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో కూడా పసుపు విరివిగా పండుతుంది. ఎపిలోని కొన్ని ప్రాంతాల్లో కూడా పసుపు పండుతుంది. మన పసుపు ఎక్కువగా బంగ్లాదేశ్, యూఏఈ, అమెరికా, మలేషియాకి ఎగుమతి అవుతున్నది. కాగా, వ్యవసాయ విభాగానికి అందించే సబ్సిడీలు నేరుగా
రైతులకు చేరాల్సిన అవసరం ఉంది. రైతులు, వ్యవసాయ పరిశ్రమల మధ్య లాభాలను సమానంగా పంచుకోవాలి. రైతులు వ్యవసాయానికి ఖర్చుచేసే ప్రతి రూపాయి దేశ ఆర్థిక వ్యవస్థను బలపరుస్తుంది. గత సంవత్సరం, 2023-24, భారతదేశంలో 3.05 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 10.74 లక్షల టన్నుల ఉత్పత్తితో పసుపు సాగు చేయబడింది. ప్రపంచ పసుపు ఉత్పత్తిలో 70శాతంనకు పైగా భారతదేశం పండిస్తోంది. మన దేశంలో 30 రకాల పసుపు ఉత్పత్తి అవుతోంది. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పసుపు ఉత్పత్తిదారు, వినియోగదారు, ఎగుమతిదారు. ప్రపంచ వాణిజ్యంలో భారతదేశం 62శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉంది. 2023-24లో, 226.5 మిలియన్ డాలర్లు విలువైన 1.62 లక్షల టన్నుల పసుపు ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. భారతదేశం నుంచి పసుపు ఎగుమతులు 2030 నాటికి బిలియన్ డాలర్లకు పెరుగుతాయని అంచనా. ఇకపోతే పసుపుబోర్డుకు ముందు స్పైసెస్ బోర్డు అన్నారు. నిజానికి దీనిని 1987 కేరళలోని కొచ్చిన్ లో 52 సుగంధ ద్రవ్యాలు, మసాలా ఉత్పత్తుల ఎగుమతిని ప్రోత్సహించడానికి, అభివృద్ధి చేయడానికి స్థాపించారు. పసుపు కూడా స్పైసెస్ బోర్డు పర్యవేక్షణలో ఉండేది. కానీ అంత ప్రాధాన్యం ఉండేది కాదు. కాబట్టి ప్రత్యేక బోర్డు సాధనకు 2019 లోక్ సభ ఎన్నికల్లో బాండ్ పేపర్ రాసి ఇచ్చిన బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ ను గెలిపించి, పసుపు రైతుల గళం ఢిల్లీలో వినిపించాలనుకున్నారు. 2020లో కేంద్రం నిజామాబాద్‌లో స్పైసెస్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం, ఎక్సటెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ సెంటర్ 'ట్రేడ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఫర్ ఎక్స్‌పోర్ట్ స్కీమ్'ని అమలుపరుస్తూ పసుపు సాగుకు మౌలిక వసతులు కల్పిస్తూ ఎగుమతులకు పెంపొందించడానికి దోహదపడింది. కానీ, పసుపు రైతులు ప్రత్యేక బోర్డు కావాలని పట్టుబట్టారు. రైతుల అలుపెరగని పోరాటాన్ని గుర్తించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలమూరు ప్రజాగర్జన సభలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆ తర్వాత సంక్రాంతి పండుగ సందర్భంగా నిజామాబాద్ కేంద్రంగా పసుపు బోర్డు ప్రారంభోత్సవం చేశారు. ఇది ఓ విజయమైతే...రైతులు పంటలను పండించి, ఆదాయం పొందితే అంతకుమించిన విజయం ఉండదు.




# 'గ్రోక్3'ని మించింది ఈ భూమ్మీద లేదు: ఎలాన్ మస్క్

రానున్న కాలంలో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)దే హవా అని టెక్ నిపుణులు చెబుతుండడం తెలిసిందే. ఇప్పటికే చాట్ జీపీటీ, గూగుల్ జెమిని, చైనా డీప్ సీక్, మెటా ఎల్ఎల్ఏఎంఏ వంటి ఏఐ మోడళ్లు రంగంలో ఉన్నాయి. టెక్ మొఘల్ ఎలాన్ మస్క్ కు చెందిన ఎక్స్ఏఐకూడా ఈ రేసులో ఉంది. ఇప్పటికే ఎక్స్ఏఐ గ్రోక్ ఏఐ మోడల్ ను తీసుకువచ్చింది. గ్రోక్ ను 'ఎక్స్' సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ పై అందుబాటులో ఉంచారు. తాజాగా, మరింత అభివృద్ధి చేసిన గ్రోక్3ని తీసుకువస్తున్నారు. దీనిపై ఎలాన్ మస్క్ స్పందించారు. గ్రోక్3 అంతటి తెలివైన ఏఐ చాట్ బాట్ భూమ్మీద మరొకటి లేదని అన్నారు. ఇది మంగళవారం ఉదయం 9.30 నిమిషాల నుంచి అందుబాటులోకి రానుందని వెల్లడించారు. కాగా, గ్రోక్3లో టెక్ట్స్ టు వీడియో ఫీచర్ కూడా ఉంటుందని తెలుస్తోంది. గ్రోక్3 రాక నేపథ్యంలో ఏఐ రేసు మరింత ఆసక్తికరంగా మారనుంది.

# హిందుసమాజం సమైక్యత ప్రధానం

**అది దేశంలో 'బాధ్యతాయుత' సమాజం -భిన్నత్వంలోనే ఐక్యత ఉందని విశ్వసిస్తుంది ఆర్ఎస్ఎస్ చీఫ్ భాగవత్**



ఫిబ్రవరి16 ప్రజావినికిడి
బర్ధమాన్ (పశ్చిమ బెంగాల్) : హిందు సమాజాన్ని ఏకం చేయడం ప్రధానమని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ఆదివారం ఉద్ఘాటించారు. అది దేశంలో 'బాధ్యతాయుత' సమాజం అని, భిన్నత్వంలోనే ఐక్యత ఉందని అది విశ్వసిస్తుందని భాగవత్ చెప్పారు. బర్ధమాన్‌లో ఎస్ఎఐ మైదానంలో ఒక ఆర్ఎస్ఎస్ కార్యక్రమం (ర్యాలీ)లో భాగవత్ ప్రసంగిస్తూ, 'మేము హిందు సమాజంపైనే ఎందుకు దృష్టి కేంద్రీకరిస్తుంటామని జనం తరచు అడుగుతుంటారు. దేశంలో బాధ్యతాయుత సమాజం హిందు సమాజమేనన్నది నా సమాధానం' అని చెప్పారు. 'ఇది ప్రత్యేక కార్యక్రమం ఏమీ కాదు. సంఘ్ గురించి తెలియనివారు అది ఏమి కోరుకుంటున్నదని ఆశ్చర్యపోతుంటారు.నేను సమాధానం చెప్పవలసి వస్తే హిందు సమాజం దేశంలో బాధ్యతాయుత సమాజం కనుక దానిని సంఘటితం చేయాలని సంఘ్ కోరుకుంటున్నదని చెబుతాను' అని భాగవత్ పేర్కొన్నారు. ప్రపంచం భిన్నత్వాన్ని అంగీకరించవలసిన ప్రాముఖ్యత గురించి ఆయన నొక్కిచెప్పారు. 'భారత్ కేవలం భౌగోళికం కాదు. భారత్‌కు ఒక ప్రకృతి ఉంది. ఈ విలువలతో జీవించలేనివారు ప్రత్యేక దేశాన్ని సృష్టించారు. కానీ, సహజంగా ఉండిపోయిన వారు భారత్ సారాన్ని అనుసరించారు. ఏమిటి ఈ సారం? అది హిందు సమాజం, ప్రపంచం భిన్నత్వాన్ని అంగీకరించడం ద్వారా మనుగడ సాగిస్తుంది. మనం 'భిన్నత్వంలో ఏకత్వం' అని అంటాం, కాని భిన్నత్వమే ఏకత్వం అన్నది హిందు సమాజం అవగాహన' అని ఆర్ఎస్ఎస్ చీఫ్ వివరించారు. భారత్‌లో చక్రవర్తులు, మహారాజులను ఎవ్వరూ గుర్తుంచుకోరు, కానీ తన తండ్రి మాట చెల్లించేందుకు 14 ఏళ్లు వనవాసం చేసిన రాజును గుర్తుంచుకుంటారు.(శ్రీరాముని ఉద్దేశించి, సింహాసనంపై తన సోదరుని పాదుకలను ఉంచిన, ఆయన తిరిగి రాగానే రాజ్యాన్ని అప్పగించిన వ్యక్తి గురించే ఆ ప్రస్తావన) అని భాగవత్ చెప్పారు. 'ఈ లక్షణాలు భారత్‌ను నిర్వచిస్తుంటాయి.ఈ విలువలను పాటించేవారు హిందువులు, వారు సమస్త దేశం విభిన్నతను సమైక్యంగా ఉంచుతారు. ఇతరులకు నొప్పి కలిగించే పనులను చేయం. పాలకులు, మహోన్నతులు తమ పని చేసుకుపోతుంటారు, కానీ దేశ సేవ కోసం సమాజం ముందుకు రావాలి' అని ఆయన అన్నారు. బెంగాల్ పోలీసులు మొదట అనుమతి నిరాకరించిన తరువాత కలకత్తా హైకోర్టు ఆమోదించిన మీదట ఈ ర్యాలీ నిర్వహించారు.

# పూజా కార్యక్రమాలతో సుధీర్ బాబు 'జటాధర' ప్రారంభం




నవ దళపతి సుధీర్ బాబు హీరోగా పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతున్న చిత్రం జటాధర. సూపర్ నేచురల్ మైథలాజికల్ జానర్లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం నేడు హైదరాబాదులో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. జీ స్టూడియోస్ సమర్పణలో ఉమేష్ కె.ఆర్.బన్సాల్, ప్రేరణ అరోరా నిర్మాతలుగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. జటాధర ప్రారంభోత్సవానికి దర్శకుడు హరీష్ శంకర్, మైత్రీ మూవీ మేకర్స్ రవిశంకర్, దర్శకుడు వెంకీ అట్లూరి, దర్శకుడు మోహన ఇంద్రగంటి, సూపర్ స్టార్ మహేశ్ బాబు వదిన శిల్పా శిరోద్కర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముహూర్తం షాట్ కు హరీశ్ శంకర్ క్లాప్ కొట్టారు.జటాధర సినిమా కథ అనంత పద్మనాభ స్వామి ఆలయం చుట్టూ తిరుగుతుంది. అక్కడి సంపద, దాని చుట్టూ అల్లుకున్న వివాదాలు, నేపథ్యం, చరిత్ర ఇలా అనేక అంశాలను ఈ చిత్రంలో చూపించనున్నారు. అక్కడి నిధిని మాత్రమే కాకుండా ఆలయ చరిత్ర, పురాణా కథల్ని కూడా చూపించబోతోన్నారు. ఈ సినిమాలో సుధీర్ బాబు కారెక్టర్ చాలా భిన్నంగా ఉండబోతోంది. 'జటాధర' యాక్షన్-ప్యాక్డ్ ఎంటర్టైనర్గా ఆడియెన్స్ ముందుకు రానుంది. థ్రిల్లింగ్, మిస్టరీ అంశాలతో 'జటాధరా'ను ఉత్కంఠభరితంగా ఉండేలా తెరకెక్కిస్తున్నారు. 'జటాధర'లో నిధి కోసం పోరాటం జరుగుతుంది.. కానీ పోరాడాలంటే కొన్ని శాపాల్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆ పోరాటం ఏంటి? ఈ శాపం ఏంటి? అని తెలియాలంటే ఇంకొన్ని నెలలు వేచి చూడాల్సిందే.

# ఓటీటీలో అకట్టుకున్న అమలాపాల్ టీచర్ పాత్రపై పలువురి ప్రశంసలు




అమలాపాల్ కీలక పాత్రలో వివేక్ దర్శకత్వం వహించిన మలయాళ చిత్రం 'ది టీచర్'. రెండేళ్ల కిందట థియేటర్లలో విడుదలై మిశ్రమ స్పందనకు పరిమితమైంది. ఇందులో అమలాపాల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్గా కనిపించింది. 2022 డిసెంబర్లో థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు మొదట మిశ్రమ స్పందన వచ్చినా తర్వాత పుంజుకుని హిట్ కేటగిరీలో చేరింది. ఇప్పుడు ఓటీటీలో దూసుకుపోతుంది. ఓటీటీ ప్రేక్షకులు ఈ సినిమా విపరీతంగా ఆదరిస్తున్నారు. ఓ టీచర్ తనకు అన్యాయం చేసిన నలుగురు స్టూడెంట్స్ పై ఎలా ప్రతీకారం తీర్చుకుంటుందన్న కథా ఆచఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు వివేక్. పక్కా మలయాళం మార్క్ రివేంజ్ థ్రిల్లర్ మూవీ నెట్ ఫ్లిక్స్లో స్ట్రీమింగ్ అవుతుంది. రెగ్యులర్ రివేంజ్ థ్రిల్లర్ సినిమాలకు భిన్నంగా ఈ చిత్రం ఉంటుంది. ఇందులో దేవిక అనే టీచర్ పాత్ర అమలాపాల్కు చక్కని ప్రశంసలు తీసుకొచ్చింది. ఊహకందని క్లైమాక్స్ సినిమాకే హైలెట్ అయ్యింది. థ్రిల్లర్, రివేంజ్ థ్రిల్లర్ జానర్ మూవీస్ ఇష్టపడే వారికి ఈ సినిమా ఎక్కువ నచ్చుతుంది. ఇందులో హకీమ్ షా, చెంబన్ వినోద్ జోష్, మంజు పిళ్లై కీలక పాత్రలు పోషించారు. దేవిక (అమలా పాల్) ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్. ఓ రోజు స్కూల్లో ఈవెంట్ తర్వాత ఆమె తిరిగి ఇంటికి వెళ్తుండగా మరుసటి రోజు తన శరీరంపై ఉన్న గాయాలు చూసి షాకవుతుంది. అసలు ఆరోజు తనకు ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఓ స్టూడెంట్ ఇంటికి వెళ్లగా.. అక్కడ భయంకరమైన నిజం తెలుస్తుంది. తనకు జరిగిన అన్యాయంపై ఆమె ఎలా పోరాడింది? కట్టుకున్న భర్త వదిలేసినా అత్త ఇచ్చిన ధైర్యంతో జరిగిన అన్యాయంపై ఎలా ఫైట్ చేసింది. ఆ అన్యాయానికి పాల్పడిన నలుగురు స్టూడెంట్స్పై ఎలా ప్రతీకారం తీర్చుకుంటుంది అన్నది కథ.

## తొలి దర్శకత్వంలోనే 100 కోట్ల గ్రాస్ చేసిన డైరెక్టర్



ఇవాళ సినిమాలు సాధించిన కలెక్షన్స్తోనే వాటి సక్సెస్ రేట్ను బేరీజు వేస్తున్నారు. నంబర్ ఆఫ్ డేస్తో సంబంధం లేకుండా ఆడినన్ని రోజులు ఎంత గ్రాస్ వచ్చిందో చెబుతూ, వాటినే పోస్టర్స్ గా వేసి సినిమా సక్సెస్ కు గీటురాయిగా చెప్పుకుంటున్నారు. శనివారం దర్శకుడు బుచ్చిబాబు సానా బర్త్ డే. డైరెక్టర్ సుకుమార్ శిష్యుడిగా చిత్రసీమలోకి అడుగుపెట్టిన సానా బుచ్చిబాబు 2021లో 'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా పరిచయం అయ్యాడు. దీనిని సుకుమార్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు నవీన్ ఎర్నేని, యలమంచిలి రవి శంకర్ నిర్మించారు. తెలుగులో తొలి చిత్రంతోనే వంద కోట్ల గ్రాస్ను కలెక్ట్ చేసిన దర్శకుడిగా బుచ్చిబాబు సానా రికార్డ్ సృష్టించారు. సానా బుచ్చిబాబు తెరకెక్కించిన 'ఉప్పెన' చిత్రంతో హీరోగా చిరంజీవి మేనల్లుడు వైష్ణవ్ తేజ్, హీరోయిన్ గా కృతీశెట్టి తెలుగు తెరకు పరిచయం అయ్యారు. తమిళ స్టార్ హీరో విజయ్ సేతుపతి హీరోయిన్ తండ్రిగా కీలక పాత్రను చేశారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందించారు. తొలి చిత్రంతోనే గ్రాండ్ విక్టరీని వైష్ణవ్ తేజ్, కృతిశెట్టి, సానా బుచ్చిబాబు అందుకున్నారు. అంతేకాదు... ఈ సినిమా ఆ యేడాది ఉత్తమ ప్రాంతీయ తెలుగు చిత్రంగా జాతీయ స్థాయిలో అవార్డుకు ఎంపికైంది. ఆ సినిమా తర్వాత ఇటు వైష్ణవ్ తేజ్, అటు కృతి శెట్టి పలు చిత్రాలలో నటించారు. అయితే వీరిద్దరికీ 'ఉప్పెన' తరహా సక్సెస్ మళ్ళీ ఇంతవరకూ దక్కలేదు. 'ఉప్పెన' గ్రాండ్ విక్టరీ తర్వాత ఎన్టీఆర్తో సానా బుచ్చిబాబు సినిమా ఉంటుందంటూ అప్పట్లో వార్తలు వచ్చాయి. అతనితో పలువురు స్టార్ హీరోలు సైతం సినిమాలు చేయడానికి ఆసక్తి చూపించారని అనుకున్నారు. అయితే సానా బుచ్చిబాబు మాత్రం రామ్ చరణ్తో మూవీ చేయడానికి సిద్ధమయ్యారు. ఆ రకంగా ఇప్పుడు రామ్ చరణ్ 16వ చిత్రాన్ని సానా బుచ్చిబాబు తెరకెక్కిస్తున్నాడు.

# పెద్దలమాట చద్దిమూట అంటున్న కంగనా రనౌత్



'పెద్దల మాట చద్ది మూట' అనే విషయం ఇప్పుడు తనకు అర్థం అయిందని బాలీవుడ్ ఫైర్బ్రాండ్ కంగనా రనౌత్ అన్నారు. సినీ, రాజకీయ రంగాల్లో క్షణం తీరిక లేకుండా ఉన్నారు. అంతే కాదు తాజాగా వ్యాపార రంగంలోకి అడుగు పెట్టారు. హిమాచల్లోని మనాలిలో కేఫ్ను ప్రారంభించారు. ఈ విషయాన్ని తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. "నా చిన్ననాటి కల 'ది మౌంటెన్ స్టోరీ' హిమాలయాల నడిబొడ్డున వికసించింది. ఈ కేఫ్ కేవలం భోజనం చేసే ఒక ప్రదేశం కాదు.. నా తల్లి వంట గది సువాసనలకు నిలయం" అని రాశారు. ఈ సందర్భంగా నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన చిన్నతనాన్ని, తన మాతృమూర్తి చెప్పిన మాటల్ని గుర్తు చేసుకున్నారు. 'ఒక మహిళగా ఇంటి పనులకు ఎక్కువ సమయం కేటాయించాలని అమ్మ ఎప్పుడూ చెబుతుండేది. ఊరగాయ, నెయ్యి తయారు చేయడం, కూరగాయలు ఎలా పండించాలో నేర్చుకోమని చెప్పేది. ఆ మాటల్ని పట్టించుకునే దాన్ని కాదు. అమ్మ తెలివితక్కువతనం తో చెబుతుంది అనుకునేదాన్ని. అవి నేర్చుకోవడం వల్ల ఏమీ ఉపయోగం ఉండదనుకున్నాను. దేశంలోనే చిన్న వయసులో ధనవంతురాలైన మహిళల్లో నేను ఒకదాన్ని అని అనుకునేదాన్ని. కానీ, ఆమె మాటలకు అర్థం ఏంటో ఇప్పుడు అర్థమైంది. నేను కేఫ్ ప్రారంభించాను. మా అమ్మ ఈరోజు ఎంతో సంతోషంగా ఉంది. నేను పరిణతి చెందానని, తెలివైనదాన్ని అయ్యానని అమ్మ భావిస్తోంది. పెద్దల మాట చద్ది మూట.. వారు చెప్పింది వినాలి, పాటించాలి అని ఇప్పుడు అర్థమైంది" అని కంగనా అన్నారు. వాలంటైన్స్ డే సందర్భంగా కంగనా ఈ బిజినెస్కు శ్రీకారం చుట్టారు.

# ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను కలిసిన నటుడు రాజేంద్ర ప్రసాద్



టాలీవుడ్ సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను కలిశారు. ఈ ఉదయం మంగళగిరిలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చిన రాజేంద్ర ప్రసాద్... పవన్ కల్యాణ్ తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పవన్ కు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఇరువురు కాసేపు ముచ్చటించుకున్నారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం కార్యాలయం సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోలను కూడా పంచుకుంది. రాజేంద్ర ప్రసాద్ చమత్కారాలకు పవన్ నవ్వుతుండడం ఓ ఫొటోలో చూడొచ్చు.

## ఓటీటీలోకి డాకు మహారాజ్..



బాలయ్య బాబు కొత్త సినిమా 'డాకు మహారాజ్' ఓటీటీలోకి వచ్చేస్తోంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫాం నెట్ ఫ్లిక్స్ లో ఈ నెల 21 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈమేరకు నెట్ ఫ్లిక్స్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. నందమూరి బాలకృష్ణ - బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కిన 'డాకు మహారాజ్' జనవరి 12న థియేటర్లలో విడుదలైంది. రికార్డు కలెక్షన్లతో తొలి ఆట నుంచే సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ సినిమాతో బాలయ్య బాబు వరుసగా నాలుగో విజయాన్ని అందుకున్నారు. కాగా, సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్యలు అత్యంత భారీ బడ్జెట్తో ఈ సినిమాను నిర్మించారు.ఇందులో బాలకృష్ణ సరసన ప్రగ్యా జైస్వాల్ నటించగా.. శ్రద్ధా శ్రీనాథ్, చాందినీ చౌదరి, ఊర్వశి రౌతేలా, బాబీ డియోల్లు కీలక పాత్రలు పోషించారు. కాగా ఈ సినిమాకు తమన్ మ్యూజిక్ అందించారు. మరోవైపు, బాలయ్య బాబు ప్రస్తుతం 'అఖండ-2' సినిమా షూటింగ్ లో బిజీబిజీగా గడుపుతున్నారు. అఖండకు సీక్వెల్ గా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇందులో సంయుక్త మీనన్ హీరోయిన్ గా నటిస్తోంది.

# ఎన్టీఆర్ ను వెండితెరకు పరిచయం చేసిన అలనాటి నటి కృష్ణవేణి కన్నుమూత




తెలుగు సినీ పరిశ్రమకు ఎనలేని కీర్తి తెచ్చిపెట్టిన అలనాటి ప్రముఖ నటి, నిర్మాత కృష్ణవేణి (102) కన్నుమూశారు. వయోభార సమస్యలతో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణవేణి ఆదివారం ఉదయం ఫిల్మ్ నగర్లోని నివాసంలో తుది శ్వాస విడిచారు. తెలుగు సినీ పరిశ్రమకు గొప్ప గొప్ప కళాకారులను పరిచయం చేసి గౌరవప్రదమైన నిర్మాతగా ఆమె మంచి గుర్తింపు అందుకున్నారు. 'మనదేశం' సినిమాతో సీనియర్ ఎన్టీఆర్ను కృష్ణవేణి సినిమా రంగానికి పరిచయం చేశారు. అంతేకాకుండా లెజెండరీ సంగీత దర్శకుడు ఘంటసాలకు కూడా తొలి అవకాశం ఇచ్చిన ఘనత కృష్ణవేణిదే.పశ్చిమ గోదావరి జిల్లా పంగిడిలో జన్మించిన కృష్ణవేణి చిన్నతనం నుంచే నటనపై ఆసక్తితో నాటక రంగంలో ప్రవేశించారు. 1936లో 'అనసూయ' అనే సినిమాలో బాల నటిగా సినీ రంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో అనేక చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. నటిగానే కాకుండా నేపథ్య గాయనిగా కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె పాటలు ఆ రోజుల్లో ప్రేక్షకులను విశేషంగా అలరించేవి.సినీరంగంపై మక్కువతో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన ఆమె 'మనదేశం' అనే చిత్రాన్ని నిర్మించారు. 1949లో విడుదలైన 'మనదేశం' సినిమాతోనే ఎన్టీఆర్ తొలిసారి వెండితెరపై కనిపించారు. తెలుగు సినీ పరిశ్రమకు ఎనలేని సేవలందించిన ఆమె మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటని పలువురు సినీ సెలబ్రిటీలు నివాళులర్పిస్తున్నారు. సినీ ప్రముఖులు, అభిమానులు ఆమెకు నివాళులర్పిస్తూ ఆమె సినీరంగానికి అందించిన సేవలను స్మరించుకుంటున్నారు.

# వైజాగ్ లో కింగ్ డమ్ !

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో పాన్ ఇండియాలో ఓ చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇటీవల 'కింగ్ డమ్' అనే టైటిల్ ప్రకటనతోనే అంచనాలు ఒక్కసారిగా తారా స్థాయికి చేరాయి. అప్పటి వరకూ సినిమాపై పెద్దగా బజ్ లేదు టీజర్, టైటిల్ రిలీజ్ తో ఇద్దరు భారీ ఎత్తునే ప్లాన్ చేసారి తేలిపోయింది. 'కింగ్ డమ్' టీజర్ సోషల్ మీడియాని షేక్ చేసింది.

వెండి తెరపై మరో సరికొత్త విజయ్ ని ప్రజెంట్ చేస్తున్నాడని అర్దమవుతుంది. టీజర్ లో కొన్ని సినిమాల కలగలిపినట్లు అనిపించినా బజ్ మాత్రం ఎక్కడా తగ్గలేదు. టీజర్ కి నెగిటివ్ ఫీడ్ బ్యాక్ రాలేదు. అక్కడే కింగ్ డమ్ సక్సెస్ కనిపిస్తుంది. ప్రస్తుతం సినిమా ఆన్ సెట్స్ లో ఉంది. ఇప్పటికే చాలా భాగం షూటింగ్ పూర్తయింది. ఈ నేపథ్యంలో తదుపరి షెడ్యూల్ విశాఖపట్టణంలో ప్లాన్ చేస్తున్నారు.విశాఖ సహా సమీప ప్రాంతాల ఎగ్జోటిక్ లొకేషన్లలో ఈ షెడ్యూల్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఇది క్లైమాక్స్ షెడ్యూల్ అని సమాచారం. దాదాపు 20 రోజుల పాటు వైజాగ్ లోనే నిరవధికంగా షూటింగ్ నిర్వహిస్తారని తెలిసింది. యాక్షన్ సన్నివేశాలతో పాటు కీలక సీక్వెన్స్ మరికొన్ని విశాఖలో చిత్రీకరించనున్నారుట. ఇప్పటికే విజయ్ దేవరకొండ వైజాగ్ చేరుకున్నట్లు సమాచారం. వచ్చే వారం నుంచి షెడ్యూల్ మొదలవుతుందని అంటున్నారు .దీనికి సంబంధించి అధికారికంగా విషయం వెల్లడికావాల్సింది. ఇప్పటికే 75 శాతం షూటింగ్ పూర్తయిందంటున్నారు. విశాఖ షెడ్యూల్ తో దాదాపు ముగింపు దశలో ఉన్నట్లు కనిపిస్తుంది. ఈ సినిమాకి సంబంధించి గౌతమ్ అండ్ కో పెద్దగా అప్ డేట్స్ ఏమీ అందించని సంగతి తెలిసిందే. మొదటి భాగం %-%కింగ్ డమ్%-% మేలో రిలీజ్ అవుతుందని మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613